మి నీ క థ :

# "శ్రీరాముడు పంపార్చు!"

లంకాధీశుని హతమార్చి సీతను చెర విడిపించాడు శ్రీరామచంద్రమూర్తి.

"అయ్యో! సీతా! నా చెలీ! ఎంతగా మారి పోయావు? నీ దర్శన భాగ్యం ఈ నిర్భాగ్యుడి కెన్నాళ్ళకు కలిగింది!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి దూరంనుంచే—

సీత విరహంతో తన ప్రభువుకోసం తపనపడుతోంది. శ్రీరాముడు చేతులు చాచి తన కౌగిట్లోకి లాక్కుంటాడను కుంది అమాయకురాలు.

"అదేమిటి ప్రభూ అలా అంటున్నారు? అశోక వనమనే ఖైదులో ఉన్న నేను నిర్భాగ్యురాలిని కాని, తమరు కాదు. రండి ప్రభూ! అందుకోండి నా మేను తమకోసం పరితపిస్తూంది!"

"వద్దు సీతా! తొందరపాటు వద్దు. నీ శరీరపు తపనను, తహతహను కొంచెం ఆపుకో" అన్నాడు శ్రీరామచంద్రుడు.

సీత నివ్వెరపోయింది.

"అదేమిటి స్వామీ! అలా అంటున్నారు. తమరలా అనడానికి కారణం? వియోగభారంతో నిండిన నా శరీరం, తమకోసం ఇంకా నిరీక్షించగలదా?"

"కొంచెం ఆగు సీతా! నాకో వ్రతముంది. ఆ వ్రతం పూర్తయేవరకూ నిన్ను తాకరాదని గురువాజ్ఞ!" అన్నాడు శ్రీరామచంద్రమూర్తి

"గురువర్యుల ఆజ్ఞా! హా నాథా ఎంత మాటన్నారు. ఎంచేత తమను తాకకూడదో సెలవియ్యండి ప్రభూ!" అంది సీత గద్గద కంఠంతో.

"నేను చెప్పలేను సీతా! ఆ కారణం గురువర్యులైన వసిష్ఠుల వారే చెప్పాలి. నా నోరు మూగపోయింది."

"అదేవిటి స్వామీ! మీరే చెప్పాలి. చెప్పకపోతే తక్షణమే, ఎదురుగా కని పిస్తున్న అగ్నిలో దూకి దగ్ధమైపోతాను" అంది సీత.

"అదేనమ్మా సీతా మాక్కావలసింది. నువ్వు అగ్నిలో ప్రవేశించడమే మా కవసరం" అన్నారు వసిష్ఠులవారు మధ్యలో జోక్యం చేసుకుంటూ—

"హేతువేమిటో సెలవిస్తారా గురువర్యులు?" ప్రశ్నించింది సీత

"ఎందుకంటావా? నీవు అనేక దినాలు రావణ బ్రహ్మ వద్ద ఉన్నావు. ఆ క్రూరుడు నిన్ను అశోకవనంలో బలాత్కారం చేసినట్టు తెలిసింది. అతడు నిన్ను చెరలో చెరచేడేమోనని మా అనుమానం" అన్నారు వసిష్ఠులవారు.

"అగ్నిలో ప్రవేశిస్తే మీ సందేహ నివృత్తి ఎలా అవుతుందో సెలవియ్యండి గురువర్యా!"

"నువ్వే పతివ్రతవైతే అగ్నిలో దహనం కావు. లేకపోతే దహనమైపోతావు!"

"తప్పు గురుదేవా! మీరలా సీతా మాతను పరీక్షించడం ధర్మంకాదు!" అన్నాడు, ఇంతలో హనుమంతుడు జోక్యం చేసుకొని.

"లేదు హనుమాన్, గురువాజ్ఞను

ధిక్కరించరాదు" శ్రీరామచంద్రమూర్తి.

"క్షమించురామా! ఈ సందర్భంలో సీతామాతను అగ్ని ప్రవేశం ద్వారా పరీక్షించడం అక్రమం! అన్యాయం! మిమ్మల్ని ధిక్కరిస్తున్నందుకు మన్నించాలి!"

"ఆంజనేయా! నువ్వీ విషయంలో అడ్డు తగలకూడదు. సీత అగ్నిలో ప్రవేశించి తీరాలి" అన్నారు వసిష్ఠులవారు కరినంగా.

"ఆ మాటకొస్తే ముందు శ్రీరాముల వారే అగ్నిలో ప్రవేశించాలి!" అన్నాడు ఆంజనేయుడు.

"అదేమిటి వాయుపుత్రా! భర్త అగ్నిలో ప్రవేశించడం ఎక్కడైనా ఉందా?" అన్నారు వసిష్ఠులవారు.

"లేకపోవచ్చును కాని మనం అవలంబించాలి" అన్నాడు ఆంజనేయుడు.

"శ్రీరాముడే అగ్నిలో ఎందుకు ప్రవేశించాలో సహేతుకంగా నిరూపించు." అడిగారు వసిష్ఠులవారు.

"తప్పక" అన్నాడు హనుమంతుడు- "సీతామాతకు శీలభంగం అయిందేమో అనే కదా ఆమెను అగ్నిలో ప్రవేశించమన్నారు? అలాగైతే సీత తన వద్ద లేనప్పుడు ఒంటరిగా ఉండలేక అతను ఏ పరస్త్రీతో సంచరించాడో ఎవరికి తెలుసు? ఆడది చెంతలేకుంటే ముందు చెడేది మొగాడే. అంచేత శ్రీరాముని శీలం పరీక్షించడానికి అగ్ని ప్రవేశం అవసరం."

"ఎంత ఘోరం!" అంటూ మూర్ఛపోయాడు శ్రీరాముడు.

—రావి-ఎన్- అవధాని

# చంద్రకాంతలు

పొద్దు గుంకిపోగానే
వికసిస్తాయి ఈ పూలు
పసిపిల్లల్లా—

చంద్రుడి పైట కప్పుకొని
సూర్యుడు కనుమరుగయ్యాక
ఒక్క రాత్రే ఉంటాయి
అవి పూలు పూలలా—

తెల్లారి వొడిలి రాలిపోటానికి
సిద్ధమైన ఆ పూలే
మళ్ళీ వికసిస్తాయి
రాత్రికి —

అవును
రాత్రే వికసిస్తాయి
నరాల గుండా కన్నీరు ప్రవహిస్తుంటే
కామం బల్లి కళ్లు
చటుక్కున నోట కరుస్తాయి
ఈ పూలనే—

పాతివ్రత్యం ఇంటి ముంగిట
ముగ్గులా నిలవవలసిన ఈ పూలే
సంఘం దృష్టిలో
గోరంట ముళ్ళు
అవును
ఆకలి నీకు తెల్సా—?

అది ఎంతటి పాతాళానికి
నెట్టి వేస్తుందో—

అందుకే వికసిస్తాయి
ఈ పూలు రాత్రిపూట
వీటిని నేను
వారకాంతలనను
చంద్రకాంతలంటా—

—సుభాష్‌చంద్ర